## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రానున్న మూడేళ్లలో 35 వేల కోట్ల రూపాయలతో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడంతోనే రాష్ట్రానికి అధికంగా పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ చెప్పారు.

❖ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

❖ రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

====================

రాష్ట్రంలో గడచిన రెండేళ్లలో సాగు నీటి ప్రాజెక్టుల కోసం 24 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద ఈరోజు జలహారతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... వచ్చే మూడేళ్లలో 35 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. పెన్నా - వంశధార నదుల అనుసంధానం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తే రాష్ట్రానికి కరువు ఉండదని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని, ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని చెప్పారు. 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

విద్యుత్ శాఖకు సంబంధించి రాష్ట్రంలో 6 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమరావతిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... నిర్ణీత గడువులోగా అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని మంత్రి వివరించారు.

====================

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు త్వరగా అనుమతులు ఇవ్వడం వల్లే ఎక్కువగా పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ... పొరుగు రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ కు పరిశ్రమలను తీసుకొస్తున్నామని చెప్పారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికే వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలో ఈ రోజు నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, ప్రస్తుత పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంజూరైన నిధులను వివిధ శాఖలు సకాలంలో వినియోగించుకోవాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ పైప్‌లైన్ పనుల వల్ల రహదారులు దెబ్బతినకుండా ఆర్ & బీ శాఖతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు పని చేయాలని కోరారు. జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైద్య ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఇరిగేషన్, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర శాఖల పని తీరును కేంద్రమంత్రి సమీక్షించారు.

విరామం

====================

ఔషధ మొక్కల సాగు, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో `ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు` అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు ఈ రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... అశ్వగంధ, మునగాకు, ఉసిరి వంటి ఔషధ పంటలకు అంతర్జాతీయంగా భారీ మార్కెట్ అవకాశాలు ఉన్నాయని, రైతులు ఈ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. రాష్ట్రంలో 280 కోట్ల రూపాయల వ్యయంతో ధర్మవరం, ప్రొద్దుటూరు, విశాఖపట్నం, పిఠాపురంలలో ఆయుష్ కళాశాలలను కొత్తగా నిర్మిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో వీటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి వివరించారు. పలు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీలను ఆధునీకరించామని సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.

====================

ఆక్వా రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రొయ్య పిల్లలు, మేత ధరలను పెంచిన వ్యాపారులు.. సాగుచేసిన రైతులకు మాత్రం మద్దతు ధరలను తగ్గించి ఇస్తున్నారని విమర్శించారు. రొయ్యల ఎగుమతుల ద్వారా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

====================

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు గ్రామంలోని చివరి లబ్ధిదారునికి చేర్చడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కొమరాడ మండలం బిన్నిడి గ్రామంలో ఈరోజు నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన రైతులందరికీ భూ హక్కు పత్రాలు  అందిస్తామని చెప్పారు. గ్రామంలో ఎవరికైనా పాసు పుస్తకాలు అందకపోయినా, ఇతర రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

====================

పశ్చిమ గోదావరి జిల్లాను ఐటీ హబ్ గా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జిల్లాలో ఐటీ పరిశ్రమల స్థాపనకు అనువైన కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలను ప్రభుత్వం రూపొందించిన itinfra.ap.gov.in పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ భవన యజమానులకు సూచించారు.

====================

విజయనగరం జిల్లా గజపతినగరంలో పలు రైళ్లను నిలపాలని, స్టేషన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. విశాఖలోని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరాను ఆయన ఈరోజు కలిసి వినతిపత్రం అందజేశారు. రాయగడ పాసింజర్ రైలును గరుగుబల్లి జంక్షన్‌లో ఆపాలని, అలెప్పీ-బొకారో ఎక్స్‌ప్రెస్, విశాఖ-కోర్బా, సమత ఎక్స్‌ప్రెస్ రైళ్లు గజపతినగరంలో నిలిచేలా చూడాలని కోరారు. అలాగే విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు గజపతినగరం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ వెసులుబాటు కల్పించాలన్నారు. వీటితో పాటు ప్రతి వారం వారణాసి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును కూడా గజపతినగరంలో ఆగేలా చూడాలని మంత్రి కోరారు.

====================

వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఏర్పడిన అల్పపీడనం ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

====================

మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన ఈరోజు నిర్వహించారు. 22ఏ దరఖాస్తుల స్థితిగతులు, పాస్ పుస్తకాల పంపిణీ, రీ-సర్వే, జాయింట్ ఎల్‌పీఎమ్స్, మ్యూటేషన్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

====================

====================